తరతరాలుగా
ఊరి పెద్దల
దౌర్జన్యాన్ని
అరి కట్టడానికి
అతనేం చేసాడు?

# వీరపల్లె వీణావాణి కధ

## ఆ వెలుగులకే ఈ ప్రస్థానం

గడియారంలోని మూడు ముళ్ళూ మురిపెంగా ఆలింగనం చేసుకునేవేళ... అప్పటివరకూ మండిపోయే ఆ ఎండలో నిర్విరామంగా పరిశ్రమించిన రైతు కూలీలు ఉసూరుమంటూ చెట్ల నీడల్లోకి చేరుకునే వేళ... నిప్పులు కురిపిస్తూ ప్రజ్వలించిపోతున్న సూర్యగోళం నడినెత్తికి వస్తున్న వేళ...

సరిగ్గా ఆ పన్నెండు గంటల వేళ...

ఆముదాలపల్లికి ఆగ్నేయదిశలో వున్న విశాలమైన ఆ చింతలతోపు చెంతకు కొంతమంది గుంపులు గుంపులుగా వస్తున్నారు. చింతచెట్ల కొమ్మల మీద కూర్చున్న కాకులూ, పిచ్చుకలూ యింకో పది నిముషాల్లో అక్కడ జరగబోయే ఓ విచిత్రమైన సంఘటనను సందర్శించడానికి ఎదురుచూస్తున్నాయి.

ఆ చింతలతోపులో ఓ చెట్టు నీడలో ఈతచాప మీద ఓ స్త్రీ మృతకళేబరం పడివుంది. శవం మీద ఓ తెల్లని వస్త్రం కప్పబడి వుంది. ఆ కళేబరం చుట్టూ చేరి కొంతమంది పెద్దలు వర్ణనాతీతమయిన విషాద, విచార భావాల్ని గర్భీకరించుకున్న నిట్టూర్పుల్ని పదే పదే విడుస్తున్నారు.

అక్కడే కొంతదూరంలో గుమిగూడిన కొందరు ఆడవాళ్లు ఆ మృతకళేబరం వేపు చూస్తూ... మరో మనిషికైనా వినిపించనంత సన్నగా గుసగుసలాడుకుంటున్నారు. ఎవరివో శాపనార్థాలు పెడుతున్నట్టు పెడుతున్నట్టు మెటికలు విరుస్తున్నారు.

అక్కడ జరగబోయే ఆ తతంగం ఏమిటో అంచనా వెయ్యలేని పసిపిల్లలు



కొందరు అయోమయంగా పరస్పరం ఒకరి ముఖాన్నొకరు చూసుకుంటున్నారు. ముడివడ్డ ఆ పసిపిల్లల యొక్క కనుబొమల నడుమ ముసురుకుంది ఓ ప్రశ్న. ఆ ప్రశ్నకి సమాధానం అక్కడ కార్యరూపం ధరించబోతూ వుంది.

ఆ పసి పిల్లలకు బుద్ధి తెలిసినప్పటి నుండి ఆముదాలపల్లిలో అలాంటి సంఘటన

జరగలేదు. అక్కడ యిక కొంత సేపట్లో విశ్వరూపంతో సాక్షాత్కరింపబోయే ఒక అర్థరహితమైన అత్యంత జుగుప్సాకరమైన మూఢాచారాన్ని తిలకించేందుకు సూర్యుడు కూడా ఆత్రుతగా ఎదురుచూస్తున్నాడు.

నిర్వికల్ప సమాధిలో నిమగ్నమైన తాపసుల్లా చింతచెట్లు నిశ్చలంగా వున్నాయి. చెట్టు కింద చాపమీద పరుండబెట్టిన ఆ శవం ముఖం మీద ఈగలు వాలుతున్నాయి. ఆ శవం యిరవై రెండు వసంతాలు నిండిన అరుంధతిది. ఆవిడ హత్యా పాతకం మాత్రం... వామనావతారంలా పెరుగుతున్న వర్తమాన సామాజిక దౌష్ట్యానిది.

ఇంతలో మాదిగవాడ నుండి గంగయ్య పరుగులాండి నడకతో ఆ చింతలతోపులోకి వచ్చాడు. అతని కుడిచేతిలో ఓ చిన్న సంచి వుంది. చర్మాన్ని కోసేందుకు ఉపయోగించే రెండు చిన్న కత్తులు ఆ సంచిలో వున్నాయి. అతని ఎడం చేతిలో ఆరడుగుల పొడవు కలిగిన నాలుగు కర్రలున్నాయి.

గంగయ్య కుడి భుజం మీద మాసిపోయిన, ముడతలు వెయ్యబడ్డ ఓ దుప్పటి వుంది. పరుగు పరుగున రావడంవల్ల అతని శరీరం చెమటతో తడిసిపోయి వుంది. అరుంధతి మృత కళేబరాన్ని పరుండబెట్టిన చింతచెట్టు వద్దకు చేరుకుని... చేతిలోని కర్రల్ని కిందపడేసి ఉసూరుమన్నాడు మాదిగ గంగయ్య.

"యేమిరా గంగా! ఈ సింతలతోపుకాడికి వొచ్చేదాన్కి నీకిప్పుడు తీరుబాటైందట్రా? నీకోసం మన్సిని పంపించి ఎంతసేపైందని? దానెమ్మ నాయాల్డి! పనిబాటోళ్ల గూడా యింత అవులైతే యేంజేసేదబ్బా?"— గంగయ్య ఆ చింతలతోపు వద్దకు ఆలస్యంగా రావడం పట్ల అసహనం ప్రకటించాడు చెంగమునాయుడు.

"యేంజేద్దుమ సామి! ఈడికి సయానవై సేస్తావుంటే... ఆ పండబ్బనాయుడొచ్చి కపిలిబావ తొండానికి రొండు అతుకులెయ్యమని నాసావం తీసినాడు. ఆయన గూడా మీ మాదిరిగానే రయితాయె. యెట్ల కాదందు? ఆయన సన్జేసి బెట్టి వూస్తావుండా"— గంగయ్య తన ఆలస్యానికి కారణం వివరించాడు.

"వారేయ్! యింగ జరగాల్సిన సని సూడండి. పొద్దు పడమర పక్కకు వాల్తావుంది. ఈ తతంగంగానీ అయిపూడిస్తే... పొద్దుగూకట్లోకి సోకముందే పీనిగిని దహనం సేసెయ్యొచ్చు"— అక్కడున్న వాళ్లందర్నీ హెచ్చరించాడు బలరామయ్య.

గంగయ్య తన కార్యక్రమం ప్రారంభించాడు.

అరుంధతి శవం చుట్టూ నాలుగు వైపులా నాలుగు చిన్న గోతులు తవ్వి... ఆ గోతుల్లో తను తెచ్చిన నాలుగు కర్రల్ని పాడిపెట్టాడు గంగయ్య. భూతలం మీద ఆ కర్రలు నిటారుగా నిలబడ్డాయి. ముడతలు పెట్టిన దుప్పటిని తీసి విదిలించాడు. ఆ నాలుగు కర్రల చుట్టూ తెరలా చుట్టి కట్టేశాడతడు.

ఇప్పుడు అదో చిన్న గదిలా తయారైంది. అరుంధతి శవం యిపుడు వెలుపలున్న

వారెవరికీ అగుపించడం లేదు. తెర లోపలి భాగంలో శవం దగ్గర ఒక్క గంగయ్య మాత్రమే నిలబడ్డాడు. తెరకు వెలుపలి భాగంలో నిలబడి చూస్తున్న వాళ్లకు గంగయ్య తల తప్ప తెరలోపల ఏమీ అగుపించడం లేదు.


శవం చుట్టూ గంగయ్య అలా తెరకట్టగానే... అప్పటివరకూ దూరంగా నిలబడి వున్న ఆడవాళ్లు, పసిపిల్లలు గబగబా ఆత్రుతతో ఆ చింతచెట్టు దగ్గరికి చేరుకోసాగారు. ఆ తెరకు వెలుపల అయిదారు అడుగుల దూరంలో చెంగమనాయుడు, బలరామయ్య మొదలైన కొంతమంది రైతులు నిలబడి వున్నారు.

"పిలకాయల్ని దూరంగా తరివెయ్యండి సావి! ఈడ నెత్తుటి పిండాన్ని చూస్తే... పసిపిల్లల గుండికాయలు నీళ్లయిపోతాయి. జడ్సుకుని ఆనక జొరం వొచ్చినా రావచ్చు" దగ్గరిలో నిలబడిన పసిపిల్లల వేపు చేయి చూపెడుతూ అన్నాడు గంగయ్య.

"హొరేయ్ పిలకాయలూ! మీరంతా ఈడికి ఎందుకొచ్చినర్లూ? మీరు ఇట్టాంటి గోస్టము సూడకూడదు. అందరూ ఈణ్ణుంచి ఎళ్లిపొండి" పిల్లలందరి వైపు చూపి అన్నాడు బలరామయ్య. కానీ పిల్లలెవరూ అక్కడినుండి కదల్లేదు. అంతులేని కుతూహలం ఆ పిల్లల్ని అక్కడ్నుంచి కదలనివ్వడం లేదు.

"హొరేయ్ పిల్లనాకొడకల్లారా! సెప్పినమాట మీ సెవుల్లో దూర్లేదాయట్ట? ఈడేందో బాలగంగమ్మ తిర్నాల జరగతావున్నట్టు అందరూ ఎగబడి సూస్తావుండారే. మరియాదగా ఈణ్ణుంచి పోతారా లేకపోతే మెట్టుదెబ్బలు పెడాల్నా? పోండ్రా మీయమ్మల..." అంటూ పిల్లల్ని చెంగమనాయుడు తరుముకున్నాడు.

ఆయన అలా వెంటపడి తరుముకోవడంతో పిల్లలంతా అక్కడ్నుంచి దూరంగా పరుగులు తీశారు. అయితే ఆ పిల్లంతా ఊళ్లోకి వెళ్లిపోకుండా ఆ చింతలతోపులోనే



దూరంగా వున్న ఓ చెట్టు క్రింద గుంపుగా చేరి ఆత్రుతగా అటే చూడసాగారు. పిల్లల మనసంతా ఆ శవం చుట్టూ చుట్టిన తెర దగ్గరే తిరుగుతూ వుంది.

ఆ తెర లోపల...

అరుంధతి మృత కళేబరం దగ్గర... శ వం కాళ్ల వద్ద మెల్లగా కూర్చున్నాడు మాదిగ గంగయ్య. తన పంచిలో వున్న ఆ రెండు కత్తుల్ని వెలుపలికి తీశాడతడు. శవం మీద కప్పబడిన గుడ్డను పూర్తిగా లాగేశాడు. చీరను కూడా బాగా కిందికి లాగేసి పొత్తి కడుపు మీద కత్తిదించాడతడు. కత్తి మెల్లగా లోపలికి దిగబడింది.

ఇంత తతంగం ఇక్కడ జరుగుతున్నా... తనకు అదేం పట్టనట్టు ఓ చెట్టునీడలో కూర్చుని శూన్యం కేసి చూస్తున్నాడు పాతిక సంవత్సరాల సదాశివుడు. అరుంధతిని అగ్నిసాక్షిగా రెండు సంవత్సరాల క్రితం పెళ్లాడిన వాడతడు. ప్రస్తుతం సదాశివుడి కళ్లలో ఎవరి అంచనాకు అందని భావమేదో కదలాడుతూ వుంది.

అక్కడే కొంత దూరంలో నిలబడ్డ ఆడవాళ్లు... దారుణంగా చంపబడిన అరుంధతి యొక్క ఔదార్యం గుంచి, ఆవిడలోని సుగుణాల గురించి అదేపనిగా చెప్పుకోసాగారు. కొంతమంది ఆడవాళ్లు సదాశివుని వేపు జాలిగా చూడసాగారు.

"ఇట్లాంటి ఆశారం మా వూళ్లో లేదక్కా" అముదాలపల్లికి ఇటీవలే కొత్తగా కోడలిగా వచ్చిన ఓ అమ్మాయి ముక్కుమీద వేలేసుకుంటూ ఆశ్చర్యంగా అంది.

"యట్లాంటి ఆశారం?"– అడిగింది ఒకామె.

"కడుపుతో వున్న ఆడదిగాని చచ్చిపోతే ఆ కడుపును కోసి పిండాన్ని బయటకు తీసేసి... అనాక ఆ పీనిగను దహనం చేసే ఆచారం" – చెప్పింది ఆ కొత్త కోడలు.

"దాన్దేవుందిలే వాక్కోరాజ్జెంలో వాకోరకమైన ఆశారాలూ అలవాట్లూ వుంటాయ్. తూరుపు రాజ్జెంలో వుండే ఆశారాలూ అవీ పడమటి రాజ్జెంలో లేవు. పడమటి రాజ్జెంలో వుండే ఆశారాలు తూరుపు రాజ్జెంలో లేవు"– అంది ఒకామె.

"అవునవును. మా ఆడబిడ్డను యిచ్చిన వూళ్లో ఆడోళ్లంతా కుడిపైట లేస్తారు. మనపక్క ఆడోళ్లంతా ఎడంపైట లేస్తారు"– ఆచారాల తేడాను ధృవపరిచింది యింకొకామె.

అందరి నడుమ రెండు క్షణాలు నిశ్శబ్దం.

ఇంతలో... ఆ చింతలతోపులో వున్న అందరి ముక్కుపుటాలను అదో రకమైన వాసన స్పృశించింది.

ఒకటే వాసన... పచ్చివాసన.. పచ్చినెత్తుటి పిచ్చివాసన... తల్లి గర్భంలో పల్లవించిన అపరిపక్వమైన పసికందు యొక్క పచ్చని వాసన... మనువెచ్చని వాసన... విచ్ఛిన్నమైపోయిన ప్రాణ సృష్టి వింత వాసన... అంతులేని వాసన... అలవాటు లేని వాసన...

ఆ చింతలతోపులో నలుమూలలా నెత్తుటి నెత్తావులు తీగల్లా అల్లుకుపోయాయి.

"యిట్టా సూడండి సామి" – గంగయ్య గొంతు గట్టిగా వినిపించడంతో అందరూ

తలలు తిప్పి తెరవేపే కన్నార్పకుండా చూడసాగారు. తెర లోపల... పైకి లేచి నిలబడ్డ గంగయ్య తన రెండు చేతుల్నీ పైకెత్తి చూపెట్టాడు. ఆ చేతుల్లో నెత్తుటి పిండం...

ఆకాశంలోంచి హఠాత్తుగా అవనీతలం పైకి జారిపడి బద్దలైపోయిన ప్రాతఃకాలపు సూర్యగోళ శకలమో అన్నట్టుగా... రక్తకాసారంలో అభ్యంగన స్నాన మాచరించిన పసికందులా... కొలిమిలో కాలిన యినపముక్కలా... అప్పుడే విచ్చుకున్న అగ్ని పుష్పంలా... ఎర్రగా నిగనిగలాడుతూవుంది ఆ నెత్తిడి పిండం.

బీభత్సకరమయిన ఆ దృశ్యాన్ని చూడగానే కొంతమందికి ఒళ్లు జలదరించింది. కొందరాడవాళ్లు జడుసుకుని వెనక్కు రెండడుగులు వేశారు. చెట్ల కొమ్మల మీద కూర్చుని వున్న పక్షులు సైతం భీతితో అరుస్తూ ఎగిరిపోయాయి. గంగయ్య చేతుల్లోని ఆ పిండాన్ని చూసిన సదాశివుడు గబగబా అక్కడికొచ్చాడు.

తన కడుపు తీపి... తమ దాంపత్య జీవితానికి తీపి గుర్తు... రెండు మనసుల పులకింత. తమ అనురాగాల పాలపుంత... తన ముద్దులపట్టి... పరిపక్వం చెందకముందే జీవతైలం ఎండిపోయిన వట్టి కట్టె... పంచభూతాల ప్రపంచంలోకి పేగు తెంచుకుని రావలసిన ఈ పసికందు సరాసరి ప్రాణం తెంచుకుని పోయింది.

గంగయ్య చేతుల్లో నెత్తురు గుడ్డు రూపంలో ఘనీభవించి వున్న తన ప్రతిరూపాన్ని కన్నార్పకుండా తదేకంగా చూస్తున్నాడు సదాశివుడు. అతనిలో ఉద్రేకం రెక్కలు విప్పుకుంటూ వుంది. పగతో అతని నవనాడులూ పదునెక్కసాగాయి.

అజ్ఞానం మూడు పూవులూ, ఆరుకాయల్లా విలసిల్లుతున్న పల్లి ఆముదాలపల్లి. అది రాయలసీమలో నాగరిక ప్రపంచానికి అతీతంగా కొండల నడుమ వున్న కుగ్రామం అది. ఆముదాలపల్లికి తూర్పు దిక్కుగా ఆరు కుటుంబాలున్న మాదిగవాడ వుంది.

ఆముదాలపల్లి అనబడే ఆ సామ్రాజ్యానికి మకుటం లేని మహారాజు 'పాలకొండరాయుడు'. తరతరాల నుండి వాళ్లది భూస్వామ్య కుటుంబం. పాలకొండరాయుడి తండ్రి వెంకటరాయుడు, తాత రాఘవరాయుడు వాళ్లు ధర్మకర్తలని పేరుపడ్డవాళ్లు.



ఎక్స్‌పయిరీ

"అయ్యా డాక్టర్‌గారూ! ఈ మందు మీద ఎక్స్‌పయిరీ డేటు లేదు. ఏం చెయ్యమంటారు?" అడిగాడు గోవిందం డాక్టర్ని.

"భలేవారే... దానికి వస్తువగాలా? వేసుకొని చూడండి. బాగే వుంటే ఫరవాలేదు లేకపోతే ఎక్స్‌పయిరీ అయిపోయినట్టే" చెప్పాడు డాక్టరు.

ఆర్.ఎస్.ఎస్. మూర్తి (గద్)

అలాంటి ధర్మకర్తల వంశంలో పుట్టిన పాలకొండ రాయుడు మాత్రం కర్కోటకుడిలా తయారుకావడమే కాకుండా తరతరాల తన వంశం పరువు ప్రతిష్టల్ని తన దురాగతాలతో పలకమీద గీతలా చెరిపి పారేశాడు.

ఆస్థి, డబ్బు, పాలకవర్గాలలో పలుకుబడి, అధికార గర్వం ఇవన్నీ పాలకొండ రాయుడిని నరరూప రాక్షసుడిలా తీర్చిదిద్దాయి. ఆ వూళ్లో ఆయన మాట వేదం. ఆటవిక న్యాయానికీ, సామాజిక దౌష్ట్యానికి వ్యాఖ్యానం పాలగొండరాయుడి జీవితం.

సదాశివుడు బి.ఏ. చదువుకున్నాడు. ఆముదాలపల్లిలో అంత గొప్ప చదువు చదువుకున్నవాడు అతడొక్కడే. ఇంకా పై చదువులు చదువుకోవాలనే అతని ఆశ... అతని తండ్రి మరణంతో అణగారిపోయింది సదాశివుడి ఆస్థి మూడెకరాల పొలం. ఎవరికీ అగుపించని ఆస్థి అతని గుండె ధైర్యం. తెగింపు స్వాభిమానం. తన భార్య అరుంధతంటే సదాశివుడికి పంచప్రాణాలు.

నాలుగు రోజుల క్రితం... పాలకొండరాయుడి ఆజ్ఞను అనుసరించి ఆముదాలపల్లిలో ఇంటికొక మనిషి చొప్పున ఆ వూరి రచ్చబండ దగ్గర రైతులంతా హాజరయ్యారు. ఊరికంతటికీ సంబంధించిన విషయాన్నేదయినా చర్చింపదలచినప్పుడు పెద్దలంతా రచ్చబండ వద్ద హాజరుకావడం ఓ ఆనవాయితీ.

"యేవిరా గంగా! రావాల్సినోళ్లందరూ ఈడికి వొచ్చేసినట్టేనా?" —రచ్చబండ మీద కూర్చున్న పాలకొండ రాయుడు మాదిగ గంగయ్య వేపు చూసి అడిగాడు.

"అందరూ వొచ్చేసినారు దేవరా! రావాల్సిన వాళ్లెవురూ యింగలేరు" — రచ్చబండ ముందు చేతులు కట్టుకుని నిలబడిన గంగయ్య వినయంగా బదులు చెప్పాడు.

"ఊరికి సంబంధించి ముఖ్యమైన సంగతొకటి మాట్లాడేదానికి మిమ్ముల్నందర్నీ ఈడికి పిలిపించినాను. నేంజెప్పేది అందరూ జాగర్తగా యినండి. మనూరికి యేదో పెద్ద అరిష్టం ముట్టుకోని వుండాది. బావులన్నీ ఎండిపోతుండాయి. పైర్లు నీళ్లు లేక మలమలా మాడిపోతున్నాయి"— పాలకొండరాయుడు చెప్పడం ఆపాడు.

అందరూ జాగ్రత్తగా వింటున్నారు.

"గొడ్డూ గోదలు గడ్డిలేకుండా గోదుగోదుమంటుండాయి. వానలేవో పడేటట్లు లేవు. యెర్రజొన్నల కరువొస్తాదేవో. ఆర్నెల్లకు ముందు కలరా వొచ్చింది. ఆ బాట గంగమ్మ ధర్మాన ఇద్దరు ముగ్గురు తప్ప వూళ్లో మనుషులు శాదారం కాలేదు. యిదంతా సూస్తావుంటే మనూరికి అరిష్టమేందో పట్టుకున్నట్టు అనిపిస్తావుంది"

ఎవరూ బదులు చెప్పలేదు.

"వూళ్లో యాడ సూసినా యిరిగిపోయిన తిరగలి రాళ్లూ, రుబ్బురోళ్లూ పడుండాయి. అట్టాంటివి వూళ్లో వుంటే దరిద్రం. అది అరిష్టం. అట్టాంటి వూరు వృద్ధిలోకి రాదు. అందుకని మనమనంతా కలిసి యిరిగిపోయిన తిరగలి రాళ్లనూ,

రోళ్లనూ వూరి పొలిమేర నుండి దూరంగా దాటించెయ్యాల" పాలకొండరాయుడు చెప్పాడు.

ఆ ప్రతిపాదనను ఎవరూ కాదనలేదు. పైగా అందుకు అందరూ సరేనంటూ తలలాడించారు.

"మంగలవారం వుదయం పది గంటలకంతా యింటికొక మనిషి చొప్పున అందరూ ఈ రచ్చబండ కాడ కలుసుకుని గుంపుగా బయల్దేరి వూళ్లో పగిలిపోయిన తిరగలిరాళ్లూ, రోళ్లూ ఎవురి ఇంటి దెగ్గర కనిపించినా వాటన్నింటినీ పొలిమేర కాడికి చేర్చాల. మర్చిపోకండి" అంటూ రచ్చబండ మీద నుండి లేచాడు పాలకొండరాయుడు.

రాయలసీమ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే జానపదుల జీవితంలో బోలెడన్ని గుడ్డి నమ్మకాలు ఇప్పటికీ గుదిబండల్లా పాతుకుపోయి వున్నాయి. అలాంటి గుడ్డి నమ్మకాల్లో ఒకటి విరిగిన తిరగలిరాళ్లని వూళ్లోంచి మరో ప్రాంతానికి తరలించడం. అలాంటి రాళ్లూ రోళ్లూ వున్న వూరు క్రమంగా క్షీణించి పోతుందని వాళ్ల విశ్వాసం.

ఊళ్లో ఇంటికో మనిషి చొప్పున బయల్దేరి వూరంతా గాలించి విరిగిపోయిన తిరగలి రాళ్లనూ రుబ్బురోళ్లనూ సేకరించి వూరి పొలిమేర వద్ద వాటిని రాశిగా పోస్తారు. యింకొక రోజు ఓ ఎడ్లబండిలో ఆ రాళ్లను నింపుకుని వాటిని తీసుకుపోయి పొరుగూరి పొలిమేర వద్ద పడేసి తిరిగి తమ వూరికి వచ్చేస్తారు.

ఆ పొరుగూరి వాళ్లు కూడా ఎడ్లబండిలో ఆ రాళ్లను నింపుకుని తమ పొరుగూరి పొలిమేర వద్ద పడేసి వచ్చేస్తారు. ఈ విధంగా ఆ రాళ్లు ఒక వూరి నుండి మరో వూరికి, అక్కడినుండి ఇంకో వూరికి అలా అనంతంగా ప్రయాణం చేస్తూవుంటాయి.

పాలకొండ రాయుడి ఆజ్ఞను అనుసరించి మంగళవారం ఉదయం ఆముదాలపల్లిలో యింటికో మనిషి చొప్పున రచ్చబండ

## అరెస్ట్ భయం



గోల్డ్‌ష్మిట్ ప్రఖ్యాత జియోకెమిస్ట్! ఆయన నార్వేలో ఉండేవాడు! అప్పట్లో అక్కడి రాజకీయ పరిస్థితి చాలా సంక్లిష్టంగా ఉండేది! తననుఎప్పుడయినా అరెస్ట్ చేస్తారనే భయంతో... ఆత్మహత్య చేసుకోనటానికి ఎప్పుడూ తనతో విషపదార్థమైన "పొటాషియం సైనైడ్"ను ఉంచుకునేవాడు! ఓసారి అతడి కొలీగ్, తనను కూడా అరెస్టు చేసి ప్రభుత్వం హింసించవచ్చుననే భయంతో తనకు కూడా కొద్దిగా పొటాషియం సైనైడ్ ఇమ్మని గోల్డ్‌ష్మిట్‌ను అడిగాడు. అందుకు గోల్డ్‌స్మిట్ నేను రసాయన శాస్త్రవేత్తను కాబట్టి దీన్ని నాతో ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఉంచుకోగలను! మీకిది లాభం లేదు! మీరు మెకానికల్ ఇంజనీర్ కాబట్టి మీకో "రోప్" కావాలని చల్లగా జారుకొన్నాడట గోల్డ్‌ష్మిట్.

జూపిటర్

దగ్గిరినుండి గుంపుగా బయల్దేరి విరిగిన తిరగలి రాళ్లనూ రోళ్లనూ సేకరించే కార్యక్రమాన్ని ప్రారంభించేశారు.

ఒక్క సదాశివుడు మాత్రం ఆ కార్యక్రమంలో పాల్గొనలేదు. అడవికి వెళ్లి కట్టెలు కొట్టుకు రావడానికి అతడు ఉదయాన్నే వెళ్లిపోయాడు. తన ఆజ్ఞను ధిక్కరించి సదాశివుడు ఆ కార్యక్రమానికి హాజరుకాలేదని తెలిసిన పాలకొండ రాయుడు మండిపడ్డాడు.

అరుంధతి యింట్లో పొయ్యి దగ్గర కూర్చుని వంట చెయ్యడంలో నిమగ్నమై పోయింది. ఆవిడ ఆరు నెలల గర్భవతి. తన యింటి ముందు ఎవరో తిరుగాడుతున్నట్టు చప్పుడు వినిపించడంతో మెల్లగా యింట్లోంచి వెలుపలికొచ్చింది అరుంధతి.

ఆ యింటి ముందు ఓ గంగరావి చెట్టు వుంది. ఆ చెట్టు నీడలో ఓ రుబ్బు రోలుంది. ఆ రోలు కొద్దిగా విరిగిపోయి వుంది. ఆ రోలు దగ్గర అయిదారుమంది నిలబడి మాట్లాడుకుంటున్నారు. చాకలి చిన్నయ్య. మాదిగ గంగయ్య యిద్దరూ కలిసి ఆ రోలును పట్టుకుని పైకి లేపుతున్నారు. గబగబ అక్కడికొచ్చింది అరుంధతి.

"యిదిగో చిన్నయ్యా! ఆ రోలును మీరెందుకు కదిలిస్తున్నారు? ఈ ఇంటికి నేను కాపురానికొచ్చేటప్పుడు ఆ రోలును మా పుట్టింటినుండి తెచ్చుకున్నా. నల్లగింజలు దంచుకొనేందుకు అది పనికొస్తాదని తెచ్చుకుంటే. ఆ రోలు మిమ్మల్నేం చేసింది? దాన్నెందుకు మీరు కదిలించేది?" అడిగింది అరుంధతి.

"అరుంధతమ్మా! ఇట్టాంటి యిరిగిపోయిన రాళ్లు వూళ్లో వుంటే... వూరికి అరిష్టమంట. అందుకని రాయుడుగారు..." అంటూ నాలుగు రోజుల క్రితం రచ్చబండ దగ్గర పాలకొండ రాయుడు కావించిన ప్రతిపాదన గురించి చాకలి చిన్నయ్య వివరించాడు.

"యేమయినా సరే ఆ రోలు మాది. అదేం బాగా యిరిగిపోలేదు. దాన్ని తియ్యమాకండి" అంది అరుంధతి.

చిన్నయ్య, మాదిగ గంగయ్యలు ఇప్పుడేం చెయ్యాలో తెలియక ఒకరి ముఖాన్నొకరు చూసుకోసాగారు.

యింతలో పాలకొండ రాయుడు అక్కడికి రాగానే చిన్నయ్య అరుంధతి అభ్యంతరం గురించి చెప్పాడు.

"ఒరేయ్ గంగా! ఆ రోలును పైకెత్తుకుని పదరా" గంగయ్యతో అన్నాడు పాలకొండ రాయుడు.

"గంగయ్యా! మరియాదగా చెప్తావుండా ఆ రోలును తాకబోక" హెచ్చరించింది అరుంధతి.

"నేనుండాను నీకేం భయం లేదు. నువ్ కానీరా" మీసం మీద చేయివేశాడు పాలకొండరాయుడు.

ఆ రోలును తన చేతుల్లోకి తీసుకోన డానికి కొద్దిగా ముందుకు వంగాడు గంగయ్య.

వెంటనే చీపురుకట్టను అందుకుని "దాన్నిగానీ ఎవురన్నా తాకితే కులం ఊడ్చిపోయే దాకా పొరకలో కొడ్తా" అంది అరుంధతి.

అరుంధతి అలా అనడంతో పాలకొండ రాయుడి అహం బుసలుకొడుతూ పడగవిప్పింది.

"వారేయ్! నువ్వు తప్పుకో. ఆ రోలును నేను తీస్తాను... యే లంజిముండ అడ్డం వొస్తాదో! నేనూ సూస్తాను—" అంటూ పాలకొండ రాయుడు ఆ రోలు దగ్గరికెళ్లాడు.

"ఆ రోలును ఏ దొంగనచ్చినోడు తీస్తాడో నేనూ సూస్తాను"— అంటూ అరుంధతి రెండడుగులు ముందుకేసింది.

పాలకొండ రాయుడి గుండె కుతకుతలాడింది. ముందుకు వంగి రోలును పైకి లేపాడాయన.


"నీ నోట్లో పుండు పుట్టా... నిన్ను నాగుపాము పెరకా... ఆ రోలు నీ యబ్బ సొత్తుకాదురా దొంగ నచ్చినోడా..."

పాలకొండరాయుడి గుండెల్లో అరుంధతి తిట్లు బాకుల్లా గుచ్చుకున్నాయి. అంతే... ఆయనలోని కర్కోటకుడు పళ్లు పటపట కొరికాడు. తన చేతుల్లోని రాయిని అరుంధతి పైకి విసిరేశాడు. అరుంధతి కడుపు ను ఆ రోలు తాకగానే... కెవ్వున చావుకేక నేసి కుప్పలా కూలిపోయింది అరుంధతి.

* * *

రాత్రి ఒంటిగంట దాటుతూవుంది. యింట్లో నులకమంచం మీద వెల్లకిలా పడుకుని వున్నాడు సదాశివుడు. అతని నేత్రాలతో యుద్ధం సలిపిన నిద్ర పరాపజయం పొంది పలాయనం చిత్తగించింది. వారం రోజుల నుండి అతనికి నిద్రాహారాలు సరిగా లేవు. ఒకానొక సందిగ్ధంతో అతడి బుర్ర ఊగిసలాడుతూ వుంది.

సరిగ్గా అదే సమయంలో... ఆ వూళ్లో వున్న కోదండరామాలయం దగ్గర పెట్రోమాక్స్ లైట్లు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఆలయం ముందు పందిరి కింద నిలబడి రసవత్తరంగా హరికథ చెబుతున్నడు దాసు. నమ్మోహనాస్త్రానికి



గుర్రైవల్లుగా ఆ వూరి జనమంతా హరికథను ఆసక్తిగా వింటున్నారు.

ఆవాళ పాలకొండరాయుడి తండ్రిగారైన వెంకటరాయుడిగారి వర్ధంతి. ప్రతి ఏటా ఆ వర్ధంతి నాడు పాలకొండరాయుడు మాంచి హరికథదాసుని పిలిపించి ఆ వూళ్ళో హరికథా కాలక్షేపం ఏర్పాటుచేస్తాడు. ఆయన చేసే అత్యల్ప సంఖ్యలోని మంచిపనుల్లో ఈ హరికథా కాలక్షేపం ఒకటని అందరూ అనుకొంటుంటారు.

మంచమంచం పైనుండి లేచి కూర్చున్నాడు సదాశివుడు. కన్ను మూసినా తెరిచినా అతనికి వారం రోజుల క్రితం మంటల్లో తగలబెట్టిన తన భార్య... భార్య గర్భంలోనే భ్రూణహత్యకు ఆహుతై పోయిన తన బిడ్డ... వీళ్లే అగుపిస్తున్నారు.

వారం క్రితం... పాలకొండరాయుడు ఆ దమనకాండ చెయ్యకుండా వుండి వుంటే... యిప్పుడు తనకో తోడుండేది. కొన్ని నెలల తర్వాత తన ప్రతిరూపం తన కళ్లముందు చిందులు' వేస్తుండేది. కానీ ఒక రాక్షసుడి దౌష్ట్యానికి భార్యతో పాటు బిడ్డకూడా బలైపోయింది. హత్య... ఒకటే కాదు రెండు. హంతకుడొకడే.

ఒక వ్యక్తిని మరొక వ్యక్తి పీడించే ఈ సాంఘిక ధర్మం యింకా ఎన్నాళ్లు? ఎన్నాళ్లీ బలవంతుల ఆచా రకాలు? వీటికి అంతం ఎప్పుడు? వీటికి అంత్యక్రియలెప్పుడు? యివన్నీ చేసేదెవరు? ఈ మహా ప్రస్థానంలో మొదటి అడుగు వేసేదెవరు?

ఆ అడుగు తనే ఎందుకు వెయ్యకూడదు? తిరగబడిన వాడు ప్రతివాడూ బలవంతుడే. పీడితుల దౌర్బల్యం తెగింపు లేకపోవడమే. పీడితులు ఏనాటికీ తెగింపుతో తిరగబడలేరనే భావనే పీడకులకు అసలైన బలం — సదాశివుడి బుర్రలో గజిబిజిగా వున్న ఆలోచనలు ఒక ఆకృతి ధరింపసాగాయి.

"అగ్రజా! దండన హింస అని భావించరాదు. శివుడూ విష్ణువు మొదలైన దేవతలు దుష్టుల్ని చంపారు. ఉచితమయిన హింసను అహింసగానే భావించాలి. యజ్ఞాలలో పశువుల్ని చంపినవాళ్లను కూడా ధర్మపరులనే వేదాలు మెచ్చుకుంటాయి. అంటూ భారత యుద్ధానంతరం వైరాగ్యంతో కృంగిపోతున్న ధర్మరాజును అనునయిస్తూ అనుజుడైన అర్జునుడు అన్నాడు. ఆ సమయంబున..." ఆ వూరి దేవాలయంలో ముందు హరికథ చెబుతున్న దాసుగారి కంఠం మైక్‌లోంచి స్పష్టంగా సదాశివుడికి విన్పిస్తూవుంది.

"ఉచితమైన హింసను అహింసగానే భావించాలి" హరికథ దాసు మాటలు సదాశివుడి చెవుల్లో అదేపనిగా మారుమ్రోగసాగాయి. సందిగ్ధంలో పడి వూగిసలాడుతున్న సదాశివుడికి ఆ మాటలు కర్తవ్యాన్ని బోధపరిచా యి.

ఆముదాలపల్లిలో ఆనాటివరకు పాలకొండ రాయుడు నిర్విఘ్నంగా నిర్వహించిన అరాచకాలు, దురాగతాలు వ రుసగా సదాశివుడి కళ్లముందు సాక్షాత్కారింపసాగాయి. వెంటనే మంచం దిగి ఆ యింట్లోని ఓ మూలకు వెళ్లి అక్కడున్న గొడ్డలిని అందుకుని దాని


అంచుని చేత్తో తడిమి చూశాడతడు.

సదాశివుడి సంకల్పంలాగే ఆ గొడ్డలి చాలా వాడిగా వుంది. ఊరికి పట్టుకున్న పీడనూ, అరిష్టాన్నీ తొలగించా లనేది పాలకొండరాయుడి సంకల్పం. సదాశివుడి సంకల్పం కూడా సరిగ్గా అదే. అయితే ఎన్నో ఏళ్లుగా ఆముదాలపల్లిని ఆవరించిన పీడ, అరిష్టాలేమిటో వాటి నిజ స్వరూపాలేమిటో సదాశివుడికి బాగా తెలుసు.

ఊరి పొలిమేర వద్ద చేర్చిన విరిగిపోయిన తిరగలి రాళ్ళూ, రోళ్ళూ మొదలైన వాటిని రేపు ఉదయం మరో ప్రాంతానికి ఊరి జనం తరలించబోతున్నారు. అలా వాటిని తరలిస్తే ఊరికి పట్టిన పీడ విరగడై పోతుందని వాళ్ల విశ్వాసం.

రేపు పట్టపగలు వెలుతుర్లో ఊరి ప్రజలు ఏ పనైతే చేయబోతున్నారో... ఈ రాత్రి చీకట్లో తను అదే పని చెయ్యబోతున్నాడు సదాశివుడు. చేయబోయే కార్యం ఒకటే. పద్ధతులు వేరు. కుడిచేత్తో గొడ్డలిని పట్టుకుని ఆ చీకట్లో... బుసలు కొట్టే ఉద్రేకంతో ముందుకు నడుస్తున్నాడతడు.

కత్తికి కత్తి... నెత్తుటికి నెత్తురు సమాధానంగా చెప్పడానికి... తన సంకల్పానికి కార్యరూపం ఇవ్వడానికి... అతని ప్రస్థానం ఆ నెల్గులకే. మహాసర్పంతో ఒక్క చలిచీమ పోరాటం చెయ్యలేకపోవచ్చు కానీ ఒక్క ముంగిస పోరాడగలదు. అలనాడు పార్థుడికి చెట్టుమీద పక్షినేత్రం మాత్రమే అగుపించినట్టు... అంత చీకటిలోనూ సదాశివుడి కళ్లకు పాలకొండరాయుడి కంఠం మాత్రమే నిప్పిస్తూ వుంది. వినీల గగనం లోంచి ఓ ఉల్క రాలిపోతూ వుంది.



## బీరువా

తాతల గురించి గొప్పలు చెప్పుకుంటున్నారు గోపి, రాము.

"మా తాతయ్యకి చాలా పెద్ద బీరువా వుండేదట. ఊళ్లోవాళ్ల బట్టలన్నీ పెట్టినా ఇంకా ఖాళీ వుండేదట" అన్నాడు గోపి.

"మా తాతయ్యకి బోలెడన్ని బట్టలుండేవట. ఊళ్లో వాళ్లంతా కట్టుకోవానికి సరిపోయేవట" చెప్పాడు రాము.

"అన్ని బట్టలే.. మరి అన్ని బట్టలు మీ తాతయ్య ఎక్కడ పెట్టే వాడు" అడిగాడు గోపి.

"ఇంకెక్కడ? మీ తాతయ్య బీరువాలో" చెప్పాడు రాము.

వై.లక్ష్మీకుమారి (కొత్తపేట)